# ఆరోజు

కలకత్తాలో రాత్రి రవ్వంత ప్రొద్దుపోయింది. మంచుతెర కప్పుకొని రవ్వంత వెన్నెల వచ్చింది. మంచుతెరని దూరంగా తరిమివేస్తూ యీదురుగాలి వచ్చింది. హుగ్లీ నదిలోని స్టీమరు ఎవరినో హెచ్చరిస్తూ బిగ్గరగా కూతకూస్తోంది. ఆకాశంలో ఎవరినో వెదుకుతూ సెర్చిలైట్లు పరుగెత్తుతున్నాయి. మంచుకు తడిసిన విక్టోరియా మెమోరియల్ ఎలనాగ చిరునవ్వులాగా మిలమిలా మెరుస్తోంది. టోకియో వెళ్ళే ఎయిర్ ఇండియా విమానం ఆకాశంమీద ముగ్గులు పెడుతూ శబ్దంకన్నా వేగంగా పరుగెత్తుతోంది. చెడిపోయిన ఎర్ర దీపం సిగ్నలు చూసి పంజాబీ టాక్సీ అపశృతి హారన్ కయ్యానికి కాలు దువ్వుతోంది. పచ్చిక బయలులలో దీపపు క్రీనీడలో వలపులు నేర్చుకుంటున్నారు ప్రేయసీ ప్రియులు.

ఇది, అంతవరకూ జరుగుతున్న చరిత్ర !

సూర్యుడు ఎన్నో ఘడియల క్రింద అస్తమించినా పశ్చిమదిక్కు అకస్మాత్తుగా నెత్తురు నింపుకుంది. భయంకర ఆర్తనాద సమూహం ! కల్లోల కోలాహలం ! బ్రతుకుల చీకటి వేళలో పశుపతి నాధుడి త్రినేత్రం, పశ్చిమ దిక్కున తెరుచుకుంది. ఎటుచూసినా దక్షయజ్ఞం. ఈ వీరభద్రుడిని అదుపులో పెట్టడానికి ఆగ్నేయాస్త్రాలు ధరించిన ఇనుపటోపీల మిటలరీ ! క్షణ కాలంలో కర్కశ స్వరాలు కరుకు ఆజ్ఞలు ! అపశృతులు యీలలు ,గోలలు, మెరుపులు, ఉరుములు. అష్టదిక్కులా ప్రతిధ్వనులు శిష్టరక్షణ దుష్టశిక్షణలు చిచ్చురగిల్చిన రాక్షసులకి, ఆహుతైపోయిన అమాయకులకి అందరికి ఒకటే స్వాగతం ! తుపాకి గుండ్లు ! ఆయుర్దాయం వున్నవాళ్లు పారిపోయారు. కాలం తీరినవాళ్ళు నేలకూలారు. పశ్చిమ దిక్కు నల్లసిరా పులుముకుంది. అలిసిపోయిన అగ్నిమాపక యంత్రం మూగపోయిన గంటలతో ఇంటిదారి పట్టింది సిబ్బంది, సైన్యం తరలిపోయారు. పరిస్థితి అదుపులోకి వచ్చిందని, వాతావరణం ప్రశాంతంగా వుందని, ఆకాశంలో అశరీరవాణి పలికింది.

పసిపిల్లవాడు పగులగొట్టిన గాజు బొమ్మలలాగా - హంసలేని ఆ జీవాలు నిన్నటి కథగా మారిన ఆ బ్రతుకులు నిశ్చలంగా వున్నాయి. అర్థంకాని సమస్యలకు, ఆవేశంతో నిండిన పరిష్కారం. ఇది ఆనాడు కలకత్తాలో జరుగుతున్న చరిత్ర ! ఆ ప్రశాంత సమయంలో, శబ్దాన్ని హరించుకుని నిశ్శబ్దం వచ్చింది. పాప పుణ్యాలకు వారధిగా హౌరాబ్రిడ్జ్ హుగ్లీ నదిమీద నిశ్చలంగా నిలిచింది. ఆగిపోయిన కథ తిరిగి ప్రారంభమయింది.

కుబేరులు, పాదుషాలు ఆకలి తీర్చుకునే గ్రేట్ యీస్టరన్ ప్రాంగణంలో దీపపు క్రీనీడలలో - చీకటి గుయ్యారంలో నెరజాణల వేట! వ్యసనాల వ్యాపారం !

తనువంతా చీకటిలో కలిసిపోయినా, ఆకలితో ఆశతో చంద్రబింబంలాంటి ముఖం మిలమిలా మెరిసిపోతూవుంటే, అలవాటు లేని అమాయకపు కంఠం - తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో - సహజమైన పిరికితన్నాన్ని దాచుకుంటూ, స్నిగ్ధ మధురంగా పలికిన మాట. "పది రూపాయలు". అంటే? పది రూపాయలు యిస్తే ఒక పడుచుదాని

పరువం బట్టబయలు అవుతుంది. ఆ పది రూపాయలు దొరికితే, కొన్ని జీవాల ఆకలి ఆ పూటకు తీరుతుంది.

పరదేశీ మౌనానికి పది రకాల అర్థాలు.

ఆడదాని సంపాదనమీద బ్రతికే పురుష వెకిలి కంఠం ".యంగ్ గరల్ సార్ ! న్యూ గరల్ సార్ !"

వడి వడిగా ముందుకు సాగిన పాదం చిరాకుగా పలికిన పరదేశి కంఠం "షటప్ !"

ప్రొద్దుపోయిన మనుషయలకు భరతుడి హెచ్చరికలాగా - క్లాక్‌టవర్ ఘంటారావం.

ఓయి అజ్ఞాని !

వింటున్నావా! వింటున్నావా!

ఘంటా రావం!

గడిచిపోతోందని కాలం

కాలం గడిచిపోతోందని

చెబుతోంది యీ ఘంటారావం!

తన ద్రోవని తాను పోతూ, ఎవరికోసం ఆగని కాలంకోసం ' మహాజ్ఞానుల వ్యర్థ ప్రయాస.

అతీతమైన శక్తికోసం - అర్హతలేని అమాయకుల నిరంతర ప్రయత్నం జ్ఞాన శూన్యుల అనవసర మీమాంస!

నష్టమైనప్పుడుకాని విలువ తెలియని విచిత్ర వరం యీ కాలం. ఆ కాలం గడిచిపోతోందని. నష్టమైపోతోందని వ్యసనపరులకు, వ్యర్థులకు హెచ్చరిక చేసే దైవవాణే యీ ఘంటారావం !!

కాల సాగరంలో ఒక పురుషుడు జలం చేతపట్టి - దాని అంచనా కోసం తర్కమీమంసలతో సతమతమయ్యే మానవుడికి- కాలమే దైవము. దైవమే కాలమని హెచ్చురిక చేసే హెచ్చరికే యీ ఘంటారావం ! మానవ జాతిని పన్నెండుసార్లు హెచ్చరిక చేసి విశ్రాంతి తీసుకుంటోంది ఘంటారావం.

బాగా ప్రొద్దుపోయిందని కాబోలు, ఆకాశంలో చందమామ కూడా కునికి పాట్లుపడుతున్నాడు.

తుఫాను వెలిసిన ప్రశాంతం- మళ్ళీ యింకొక ప్రళయం ముంచుకొచ్చేలోగా ఆదమరచి నిదుర పోవాలని మానవజాతి ప్రయత్నం ఆరాటం.

కాని యీ కలకత్తాలో సామాన్య మానవుడికి పీడకలలు. కలవరింతలు ఊపిరి సలుప కుండా కంఠం నులిమే పిశాచాల కరాళ హస్తాలు. నిత్య సంఘర్షణలో వెలుగు నీడలలో, మధ్య బ్రతుకే ఒక శ్రుతి తప్పిన రాగం. కాని యీ నిరంతర సంక్షోభం లో కూడా హాయిగా ఆదమరచి నిదుర పోగల అదృష్టవంతులున్నారు. సామాన్య మానవుడిని వేధించే సమస్యలతో వారికి నిమిత్తం లేదు. పూర్వజన్మ సుకృతం కొండంత వెంటపెట్టుకు వచ్చిన మైనారిటీ వర్గం యీ మహానగరంలో కూడా వున్నారు. ఈ లక్షల జనాభాలో వాళ్ళని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు ! ఆ వర్గంలోనే చేరుతుంది. ఆ అనన్య సౌందర్యరాశి ! ఆ సునందా బెనర్జి ! రేపటి వెలుగులో పలుకరిస్తే యీ పరదేశిని

గుర్తుపడుతుందా ! చిరునవ్వుతో స్వాగతం పలుకుతుందా ! కాలం గడిచింది రెండే రెండు సంవత్సరాలే అయినా, తలుచుకుంటే ఈనాడు గడిచిన గాథలాగా అనిపిస్తుంది ఆరోజు !

ఆనాటి-యీనాడు లాగానే వెన్నెల రోజులు మంచుతెరల దొంతరలు, కాలంకాని కాలంలో తుఫానుగాలి, వెనువెంట నల్లని మబ్బులు, తెల్లటి మంచుతెరలు, నల్లటి నీటితుప్పర, క్షణం క్షణం ఎక్కువ అవుతున్న వాన, తలదాచుకొనడానికి సత్రం అరుగుమీద చేరాను.

తనకు రవ్వంత దూరంలో వాళ్ళు ముగ్గురు. ఆరిపోయిన దీపాలు వెలిగినాయి, వెలుగులో, వాళ్ళ స్వరూపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాళ్ళ సంభాషణ బట్టి తెలుస్తోంది వాళ్ళు బెంగాలీవాళ్ళు అని. కాని వాళ్ళ దుస్తులు చూస్తే యీ నాటివిగా కనిపించటంలేదు. రెండు మూడు తరాల వెనుకవి. ప్రథమ దర్శనమే అయినా వాళ్ళు పరాయివాళ్ళులా కనిపించలేదు. చాలా రోజుల తరువాత కనిపించిన పాత స్నేహితులులాగ మనస్సుకి ఆహ్లాదం కలిగించారు. కాని మనస్సులో ఒకేఒక ప్రశ్న. ఏదో అర్థం కాని జిజ్ఞాస. ఆ నల్లటి తలకట్టు తుమ్మెద రెక్కల్లాంటి ఆ జుట్టు ! పెద్ద పెద్ద కళ్ళు ! చంద్రబింబంలాంటి ముఖం కొట్టవచ్చే ఆ వర్చస్సు. శాంత స్నిగ్ధ మనోహరమూర్తి ! మనసు చెబుతూనే వుంది యీ స్వరూపాన్ని ఎక్కడో ఎప్పుడో చూశానని.

నా ప్రశ్నలకు సమాధానం లభించే లోపల వాళ్ళే నన్ను పలుకరించారు. "మీరుకూడా కనకదుర్గ దర్శనానికేనా ?

"అవును."

"పరదేశీయులం. మాకు ఆలయానికి దారి చూపించగలరా !" అంటూ అందులో ఒక యువకుడు అడిగాడు బెంగాలీలో.

ఆకాశం వంక చూశాను - వాన వెనుకపడింది. తెరతీసిన మబ్బులచాటునుంచి ఒకటి రెండు నక్షత్రాలు కనుపిస్తున్నాయి. అమ్మవారి ఆలయం లో దీపాలు మళ్ళా వెలిగాయి. ఎక్కడో దూరంగా లౌడ్‌స్పీకరులో సినిమా పాటలు వినిపిస్తున్నాయి,

"నేనూ అక్కడికే వెడుతున్నాను కలసి వెడదాం రండి" అని అన్నాను చూస్తూవుండగానే మబ్బులు దూరమయ్యాయి. మసక మసకగా వెన్నెల వచ్చింది. పిలచినట్టుగా మా ముందు వక టాక్సీ వచ్చి ఆగింది. అందరం కలిసి టాక్సీలో కొండమీదకు వెళ్ళాం, ఇంత గాలివాన వచ్చినా ఆలయంలో యథాప్రకారం పూజలు జరుగుతున్నాయి.

భక్తులు ఎక్కువమంది లేరు. వెంట వచ్చిన చిన్నది అందరికన్నా ముందుకు వెళ్ళి నిలబడింది. క్యూలో నిలుచున్న వ్యక్తులు ఎవరూ కాదనలేదు. ఒక్క క్షణకాలం ఆ పిల్లవంక చూసి రవ్వంత వెనక్కి తగ్గి నిలబడ్డారు. అర్చకుడు కూడా యీ అభ్యాగతులని ఎక్కువగానే ఆదరించాడు.

ప్రసాదాలు తీసుకుని ఆలయంలోంచి బయటకు వస్తూవుంటే దాదాపు నలభై సంవత్సరాలు పైగా అమ్మవారి పూజలో గడిపిన ముసలి పూజారి కనిపించాడు. మావంక తేరపార చూశాడు. ఆ అమ్మాయి దగ్గరకు వచ్చి పరకాయించి చూశాడు. వాళ్ళు ముగ్గురూ ఆయనకు నమస్కారం చేశారు.

ఆయన తనలో తాను అనుకున్నట్టుగా రవ్వంత బిగ్గరగానే-

"అచ్చంగా వాళ్ళలాగానే వున్నారు" అని అన్నాడు.

వాళ్ళు ఆయనవంక ఆశ్చర్యంగా చూశారు. మళ్ళా మళ్ళీ వీళ్ళ వంక చూసుకుంటూ ఆయన ముందుకు సాగిపోయాడు. వచ్చిన కారులోనే ఎక్కి కొండ దిగాం. వాళ్ళంతా మనులా

హోటల్ దగ్గర దిగిపోయారు.

సమయం తొమ్మిది గంటలు కావస్తోంది.

"మీకు చాలా శ్రమ యిచ్చాం" అని అందులో వకతను అన్నాడు.

"మీపేరు ఏమిటి?" అని ఆ అమ్మాయి బెంగాలీలో అడిగింది.

"భవానీ ప్రసాద్" అని సమాధానం చెప్పాను!

"నా పేరు సునంద. ఇతను మా అన్నయ్య సతీశ్. ఆయన మా స్నేహితుడు ఉపేంద్ర' ' అంటూ పరిచయం చేసింది.

"మీరు ఏం చేస్తూవుంటారు? ఉద్యోగమా?" అంటూ సతీశ్ అడిగాడు.

"జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నాను." అని సమాధానం చెప్పాను.

"మీరు బెంగాలీ చాలా బాగా మాట్లాడుతారే!" అని సునంద అన్నది.

"మీ కలకత్తాలో ఆరు సంవత్సరాలు వున్నాను: అక్కడే చదువుకున్నాను."

"మీరు కలకత్తా తరుచూ వస్తూ వుంటారా?" అని అడిగింది.

"సుమారు ఏడాదికి వకసారి వస్తూ వుంటాను"

"ఈసారి కలకత్తా వచ్చినప్పుడు మా యింటికి తప్పక రావాలి. కలకత్తాలో ఎవరిని అడిగినా మాయిల్లు చెబుతారు తప్పక రండి.

అడ్రసు తీసుకుని పర్సులో పెట్టుకున్నాను.

"మీరు విజయవాడలో ఎన్నిరోజులు వుంటారు!" అని అడిగాను.

"ఎన్నోరోజులు వుండం. రేపు ప్రొద్దున్నే కృష్ణానదిలో స్నానంచేసి మావూరు వెళ్ళిపోతాం' ' అని సునంద అంది.

"విజయవాడు రావడం ఇదే మొదటి సారా?" అని అడిగాను.

"విజయవాడ కనకదుర్గ మా కలకత్తా కాళి అవతారం అని మా పూర్వీకులు వాళ్ళు చెప్పారు. ఎన్నోసార్లు ప్రయత్నం చెయ్యగా యీనాటికి సాధ్యపడింది మీ వూరు మా కలకత్తాకన్నా ఎంతో బాగుంది. అమ్మవారిని చూడటం కోసమన్నా ఈ వూరు మళ్ళీ మళ్ళీ రావాలనిపిస్తోంది" అని ఆ చిన్నది అన్నది.

"వస్తూనే వున్నాంగదా" అని సతీష్ అన్నాడు.

"ఇంకా ఎంతకాలం రావాలో" అని వాళ్ళ స్నేహితుడు అన్నాడు.

"సంతృప్తి కలిగేదాకా" అని సునంద పలికింది.

నాకు వాళ్ళ భాష అర్థం అవుతోంది కాని వాళ్ళ మాటలు అర్థం కావటంలేదు.

సమయం తొమ్మిదిన్నర అవుతోంది. మా త్రోవలు వేరు అయ్యేస్థలం వచ్చింది.

"వెన్నెలచూడు ఎంతబాగుందో! హుగ్లిలోలాగా యీ వెన్నెలలో కృష్ణా నదిలో బోట్ షికారుకు వెడితే" అని సునంద అన్నది.

"మిగతా ఇద్దరూ సరేనంటే సరేనన్నారు మీరూ రాకూడదూ రండి బాగా వుంటుంది' ' అని సునంద నన్ను పిలిచింది.

నేను ఆకాశంవంక చూశాను. వెన్నెల అయితే వుందికాని, సాయంకాలం కురిసినవాన నాకు యింకా గుర్తువుంది. మర్నాడు నేను హైదరాబాద్ వెళ్ళవలసిన మీటింగుకూడా గుర్తువుంది.

"ఇంకొక అరగంటలో బయలుదేరి హైదరాబాదు వెళ్ళిపోతున్నాను" అని అన్నాను.

మగవాళ్ళు యిద్దరూ 'గుడ్‌బై' అని అన్నరు. సునంద మాత్రం "కలకత్తా వచ్చినప్పుడు మా యింటికి తప్పక రావాలి" అని మళ్లీ ఇంకొకసారి హెచ్చరిక చేసింది.

వాళ్ళు వెళ్ళిపోయారు. నేను బస్సు స్టాండు దగ్గర నిలబడ్డాను. వెన్నెలపోయి చీకటి వచ్చింది. మళ్ళీ సన్నగా తుపర ప్రారంభం అయింది. మళ్ళీ గాలి ప్రారంభం అయింది. లైట్లు ఆరిపోతూ వెలుగుతున్నాయి.

పెద్దపెట్టున మెరుపు మెరిసింది. బిగ్గరగా ఉరుము ఉరిమింది. దూరంగా ఎక్కడో పిడుగు పడింది.

ఎదురుగుండా రిక్షావచ్చి ఆగింది. గుళ్ళో కనబడిన ముసలి పూజారి ప్రసాదం చేత్తో పుచ్చుకుని దిగాడు.

వాన ఎక్కువైంది. నా సరసనే వచ్చి తలదాచుకున్నాడు. దీపాలు ఆరిపోయాయి. మెరుపు వెలుగులో నన్ను గుర్తుపట్టాడు.

"వాళ్ళు ఏరి? అని నన్ను ప్రశ్నించాడు."

నేను సమాధానం చెప్పేలోపలే- "బోట్ షికారుకు కృష్ణ వడ్డుకు వెళ్లారా?" అని ఇంకొక ప్రశ్న వేశాడు.

నేను ఆలోచించకుండానే సమాధానం చెప్పాను. "వెళ్ళారు"

ఆయన నా సమాధానం విని వక్క క్షణం కాలం మౌనంగా వున్నాడు. నా మనస్సులోంచి నిట్టూర్పు వచ్చింది. తనలో తాను అనుకుంటున్నట్టుగా ఆయన-

"ఐతే మళ్ళీ మరణిస్తారు" అంటూ వానని లక్ష్యం చెయ్యకుండా వడివడి అంగలు వేసుకుంటూ ఎదురుగావున్న సందులోకి వెళ్ళిపోయాడు.

ఆయనవెంట వెడదామనుకున్నాను. వెళ్ళి అడుగుదామనుకున్నాను. కాని నేను వెళ్ళవలసిన హైదరాబాదు బస్సుకదలబోతోంది.

దూరమవుతున్న ఊరుతోబాటు ఆనాటి సంఘటనలుకూడా మనస్సునుంచి దూరమైయ్యాయి.

సంసార సాగరంలో యీదులాడే యీ సామాన్య మానవుడు, జరుగుతున్న చరిత్రని గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు.

గతాన్ని తలుచుకోవలసిన అవసరం కాని, అవకాశంకాని కనిపించలేదు.

కాని కలకత్తాలో యీ అసుసంధ్య వేళలో అడుగుపెట్టగానే జ్ఞాపకాల దొంతరక్రింద మాటు మణిగిన పాత గాధ, సరిక్రొత్తగా గుర్తుకు వచ్చింది. ఆనాటి క్షణకాలం మిత్రులని చూడాలని అనిపించింది. ఈరేయి గడిచి పగలు ఎప్పుడు వస్తుందా అనే తహతహకూడా కలిగింది. మూడు పేర్లలో వకే పేరు గుర్తువుంది. మూడు మూర్తులలో లీలగా మసగగా స్మృతిపథంలో చెడిపోయిన ఫోటోలాగా, ఒక రూపమే గుర్తువుంది. వాళ్ళు ఎదుటపడితే వెంటనే నేను గుర్తుపట్టగలనో లేనో అనే సంశనీయంకూడా కలిగింది. నేను గుర్తు పట్టినా వాళ్ళు నన్ను గుర్తుపట్టగలరో లేదో అన్న ప్రశ్న కూడా వచ్చింది.

చీకటిలో కలిగిన యీ సంశయాలకు ప్రశ్నలకు సమాధానం వెలుగే చెబుతుంది. ఎట్టకేలకు వెలుగు వచ్చింది. రాత్రి చీకటిలో భయంకర సమస్యలుగా కనిపించినవి పగటి వెలుగులో గోరంతలుగా కనిపించాయి. వాళ్ళు గుర్తుపట్టినా పట్టకపోయినా వాళ్ళని

వకసారి చూడాలని అనిపించింది. చీకటిలో చూసిన సునంద పగలు వెలుగులో ఎల్లావుంటుందో చూడాలి.

ప్రమోద్ బెనర్జీ - అంటే సునంద. సతీష్ వాళ్ళ నాన్నగారియిల్లు వెదుక్కుంటూ బయలుదేరాను.

"మా యిల్లు కలకత్తాలో అందరికి తెలుసు. ఎవరిని అడిగినా చెబుతారు అని సునంద ఆనాడు అన్నది. కాని ఎందరినో అడిగితేనేగాని ఆ ప్రాంతం కనుక్కోవడం సాధ్యం కాలేదు. చాలామంది ఆ పేరు ఎప్పుడూ వినలేదని అన్నారు. చిట్టచివరకు డెభై ఎనభై సంవత్సరాల పండు ముదుసలి దోవ చెప్పాడు.

అక్కడికి చేరుకునేసరికి మిట్ట మధ్యాహ్నం అయింది. సునంద చెప్పినట్టు అది చాలా పెద్దయిల్లే వకప్పుడు. ఇప్పుడు అక్కడ కోటలాంటి యిల్లూ లేదు. శరత్‌బాబు నవల్లోలాంటి వ్యక్తులు లేరు. నాచుతోనిండిన కొలను. భయంకరంగా అడవిలాగా పెరిగిన తోట, ఈనాడో రేపో కూలిపోవడానికి సిద్ధంగా వున్న గోడలు.

అడ్రెసు కాగితంవంక మరొక్కసారి చూసుకున్నాను.

"సతీశ్‌బాబు వాళ్ళకోసం వచ్చారా?" అంటూ ఒక కంఠం నన్ను పలుకరించింది.

ఉలిక్కిపడి అటుచూశాను. జాంబవంతుడికన్నా ముసలివ్యక్తి నావంక చూస్తున్నాడు.

నాచేతిలో అడ్రసు కాగితంవంక చూసి, "మీకు కూడ బెజవాడలో దుర్గ గుడి దగ్గర కనబడి అడ్రసు యిచ్చారా?" అని అడిగాడు.

నేను ఆశ్చర్యంగా అతనివంక చూస్తూ, "నువ్వు ఎవరు?" అని అడిగాను.

"ప్రమోద్ బెనర్జీగారి నౌకరును"

"సునందా వాళ్ళు ఏరి?"

అతను నావంక చూడకుండా గతంలోకి చూస్తూ సమాధానం చెప్పాడు. "బెజవాడ కృష్ణలో వెన్నెల్లో పడవ షికారుకు వెళ్ళి - పడవ మునిగి వాళ్ళు ముగ్గురు మరణించారు.

"ఎప్పుడు? ఎప్పుడు" నేను అడిగాను. అతను జాలిగా నా వంక చూస్తూ అన్నాడు.

"నలభై సంవత్సరాల క్రితం !"

# అదృష్టం ఆమడదూరం

రెండు నిముషాలు ఆ స్టేషనులో ఆగి రైలు వెంటనే బయలుదేరింది. ఇంతవరకూ ప్లాటుఫారం మీద నిద్దురపోతున్న కుక్క, వులిక్కిపడి లేచి, చికాకుగా మొరిగి మళ్ళీ పడుకునే ప్రయత్నంలో వుండగా, రైలు ఒక్కసారి బిగ్గరగా కూత బెట్టింది. కూత తగ్గగానే బయలుదేరింది. కుక్కకి కోపం వచ్చి, బిగ్గరగా మొరుగుతూ తను కూడా రైలు వెంట ప్లాటుఫారం చివ్వరదాకా పరుగెత్తింది. రైలు పోయింది. కుక్క మిగిలిపోయింది.

బిస్కెట్లు అమ్మే సాహెబు అలవాటుగా యాలవేయగానే కుక్క అతని దగ్గరకు పరుగెత్తుకుంటూ వెళ్ళి, బిస్కెట్ల వంక ఆశగా చూస్తూ, జాలిగా మొరిగి బ్రతిమాలుతున్నట్టు